క్లుప్తంగా

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం



కాశిపాడులో పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రదర్శన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రదర్శన

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునని, పరిశుభ్రత ఆరోగ్యానికి మూలమని గణపవరం మండలం చిలకంపాడు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం కె.రవి కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామంలో వైద్యారోగ్యశాఖ, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ దుర్గాభవాని, ఆరోగ్య సిబ్బంది మాధురి, ఏసమ్మ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయం వద్ద అన్నసమారాధన

ఉంగుటూరు: నారాయణపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా వారం రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక చర్యతో ఎలుకల బెడద నివారణ



పూళ్లలో రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

భీమడోలు: సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ ద్వారా పంట నష్టం గణనీయంగా తగ్గి, రైతులు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని వ్యవసాయశాఖ ఏడీఏలు డాక్టర్ పి.ఉషారాజకుమారి, శైలజలు, రైతు శిక్షణ కేంద్రం డీఆర్సీ లలితాసుధాలు అన్నారు. పూళ్ల ఆర్‌బీకే వద్ద శుక్రవారం రైతుల సమక్షంలో ఎలుకల నివారణ మందు బ్రోమోడలిన్‌ను తయారు చేసి రైతులకు పొట్లాల రూపంలో ఉచితంగా అందజేసారు. పూళ్లలో పొట్లాలను ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ రైతులకు అందజేసారు. ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ఎలుకల నివారణ మందును వినియోగించుకుని పంటను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఆర్‌బీకే సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

పెదపాడు: మండలంలోని రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని వట్లూరులో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. విషపు ఎర తయారీ కోసం 96శాతం నూకలు, 2శాతం నూనె, 2శాతం బ్రోమోడయొలిన్ మందును ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని, రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా అనేక చట్టాలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్నప్రసాద్

పెదపాడు: మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా అంతరంగిక కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే రత్నప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని టీటీడీసీ హాలులో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళా రక్షణ చట్టాలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కే రత్నప్రసాద్ మాట్లాడుతూ న్యాయ సలహాల కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందన్నారు. నేషనల్ ఉమెన్ కమిషన్ ట్రైనీ బి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని అన్నారు. ప్రాజెక్టు మేనేజరు అనిత పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ కేశలి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పారావు బాలల హక్కుల పరిరక్షణ ప్రాంతీయ స్థాయి కన్వర్జెన్స్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం ఏలూరు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- గాలాయగూడెంలో రూ. కోటి నిధులతో అభివృద్ధి పనులు
- ఉత్సవాల ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలను ప్రారంభించడం తన పూర్వజన్మ సుకృతమని, అమ్మవారి ఆశీస్సులతో ఆలయంలో, గాలాయగూడెంలో రూ. కోటి నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే అన్నారు. గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవ మహోత్సవాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి జీఎన్‌టీ రోడ్డు నుంచి అమ్మవారి గుడి వరకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను నూజివీడు డీఎస్పీ మురళీకృష్ణ, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ తాను అమ్మవారికి భక్తుడినని, అమ్మవారి ఆశీస్సుల వల్ల తాను ఈ స్థితిలో ఉన్నానన్నారు. టీటీడీ నిధులతో త్వరలో అమ్మవారి ఆలయ ఆవరణలో నూతన కల్యాణ మండపం నిర్మిస్తామని గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ సందర్భంగా గాలాయగూడెం గ్రామ కమిటీని అభినందించారు. నూజివీడు డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అచ్చమ్మ తల్లి ఆలయానికి విధి నిర్వహణపై రావడం ఎన్నటికీ మరువలేనని అన్నారు. అమ్మవారి ఉత్సవాలు విజయవంతమయ్యేలా శాఖాపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



గాలాయగూడెంలో నూతన ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

అచ్చమ్మ తల్లి ఆలయంలో ఇప్పటి వరకు దాదాపు రూ. 50 లక్షలకుపైగా నిధులతో అభివృద్ధి పనులు చేసి నేడు జీఎన్‌టీ రోడ్డు నుంచి అమ్మవారి ఆలయానికి రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించిన దాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఘంటా కోటేశ్వరరావు, అచ్చమ్మను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.అనంతరం రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పలు గ్రామాల సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు వ్యవసాయ రంగానికి వెన్నెముక

వ్యవసాయ రంగానికి, రైతులకు ఆర్‌బీకేలు వెన్నెముక అని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూ. 22 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంట్రాక్టర్ తోట వెంకన్న, స్థలం దానం చేసిన దాతలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆర్‌బీకేలోని వివిధ గదులను ఆయన పరిశీలించారు. రైతుభరోసా కేంద్రానికి స్థల దాతలను ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, సర్పంచ్, సొసైటీ చైర్మన్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పీ.శ్రీలత, ఏఓ గద్దె రమేష్, పీఆర్ఏఈ చౌదరి, కామిరెడ్డి నాని, గంటా కోటేశ్వరరావు, లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూజివీడు డీఎస్పీ

నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ మురళీకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆయన కార్యాలయంలో కలిశారు. నూతన డీఎస్పీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పెదవేగి సీఐ కే.శ్రీనివాస్, దెందులూరు ఎస్సై కే.స్వామి ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

పెదవేగి : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలోని వేంకటేశ్వర, వేణుగోపాల స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన దేవాలయం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, ఉపసర్పంచ్ లేగల శివ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

గణపవరం: పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం సరిపల్లెలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు 350 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.శివరామ్‌ప్రసాద్, సీహెచ్‌వో జూలాది విల్సన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవ్వగుంట జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని కవ్వగుంటలో శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యం అందించడంతో పాటు, మందులను ఉచితంగా మందులు అందించారు. కంటి చూపునకు సంబంధించి ఎక్కువ మంది ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు మాధవి, మల్లికార్జున్, అపూర్వ, సాయికృష్ణ, సీహెచ్ఓ రోజు మేరీ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ



ఉప్పాకపాడులో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉప్పాకపాడు గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: వైఎస్సార్ ప్రభుత్వం పాలనలో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందుంజలో ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం ఉప్పాకపాడులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొని మాట్లాడుతూ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించాయన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ప్రజోపయోగ అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అంతర్గత రహదార్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసి, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. మంచి నీటి రక్షిత పథకాలను అభివృద్ధి చేశామని తెలిపారు. సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. దళితవాడ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వాసుబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, నాయకులు కొరిపల్లి శ్రీను, బళ్ల త్రిమూర్తులు, నక్క శ్రీను, వెల్లమిల్లి నాగు, గంటా సుబ్బారావు, గ్రామ పార్టీ నాయకులు, సర్పంచి నేదూరి అబ్బులు, ఉప సర్పంచి షేక్ వల్లీ పాల్గొన్నారు.

నేడు పోతునూరులో ఆర్‌బీకే, సచివాలయం ప్రారంభోత్సవం



పోతునూరులోని నూతన సచివాలయం



పోతునూరులో నూతన రైతు భరోసా కేంద్రం

దెందులూరు : పోతునూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభోత్సవం చేస్తారని సర్పంచ్ బోదుల స్వరూప్ తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీటీసీ సున్నా సుధీర్ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

కేంద్రం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

గణపవరం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా గణపవరం సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేశవరం మూడురోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. సోడదాసి సంజీవరావు, మెంటే సూర్యారావు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టండి

పెదపాడు: కేంద్ర మోదీ ప్రభుత్వ రైతాంగ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెలో భాగంగా పెదపాడులో సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, గుండపనేని సురేష్, పల్లపోతు రెడ్డియ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

భీమడోలులో మానవహారం

భీమడోలు: భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం భీమడోలులో కార్మిక, కర్షకులు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.లింగరాజు, న్యాయవాది రంగరాజు, రైతు సంఘం నేత కట్టా భాస్కరరావు, సీఎంపీ నేతలు బి.నాగరాజు, మానుకొండ వీర్రాజు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.



పెదపాడు బళ్ల రేవు సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

పెదవేగిలో నిరసన

పెదవేగి : సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పెదవేగిలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి. హైమావతి, మండల కార్యదర్శి పి .ప్రసాద్, యూనియన్ నాయకులు రోజా, తులసి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోరుకల్లుకు రానున్న ఎస్సీ కమిషన్ చైర్మన్

భీమడోలు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఈనెల 17వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు కోరుకల్లులో పర్యటిస్తారని తహసీల్దార్ జి.వరహాలయ్య శుక్రవారం రాత్రి తెలిపారు. కోరుకల్లులోని ఎస్సీ కుటుంబానికి చెందిన భూమి ఆక్రమణపై విచారణ నిమిత్తం ఆయన వస్తున్నారని తహసీల్దార్ పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే పథకాల లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వేగివాడలో4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత
- సంబరాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కారుమూరి సునీల్‌కుమార్



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్‌కుమార్

పెదవేగి : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, ఆర్థిక స్వావలంబన సాధించేలా అనేక పథకాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం వేగివాడలో శుక్రవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాల్లోనూ వారికి ప్రత్యేక స్థానం కల్పించి, ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం పెదవేగి మండల వ్యాప్తంగా ఉన్న 1,872 స్వయం సహాయక సంఘాల్లోని 18,686 మంది మహిళలకు రూ.17.58 కోట్ల ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కర్త కారుమూరి సునీల్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ , జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీ నిట్టా లీల నవకాంతం, ఎంపీపీ తాత రమ్య, జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు పాల్గొన్నారు.



వేగివాడలో స్వయం సహాయక సంఘాల మహిళలు

ట్యాబ్‌ల వినియోగంతో ఉత్తమ ఫలితాలు



ఆగడాలలంక ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో ఎస్.అబ్రహం

భీమడోలు: విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్ ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన చేసి వారిలో పరిజ్ఞానాన్ని పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. ఆగడాలలంక ఓరియంటల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను, నాడు- నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలందించారు. అనంతరం పాఠశాలలో 9 తరగతి గదిలో ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. విద్యాసామర్థ్యాలపై ఆయన వారిని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. తరగతి గదిలో 25 మందిలో 18 మంది ట్యాబ్‌లు వినియోగిస్తుండగా, మిగిలిన 7 ట్యాబ్‌లు మరమ్మతులకు గురవడంతో వాటిని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేశామని హెచ్‌ఎం ఎంఏ సత్యనారాయణ డీఈవోకు తెలిపారు. త్వరితగతిన మరమ్మతులు చేయించి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయాలని డీఈవో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగానికి అధికంగా నిధులు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొంది సబ్జెక్టుల్లోని పాఠ్యాంశాలను అవగతం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. నూరుశాతం విద్యార్థులు ఆహారం భుజించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు



అన్నేవారిగూడెంలో సూర్యనమస్కారం చేస్తున్న విద్యార్థులు, టీచర్లు



పూజలు అందుకున్న సూర్యనారాయణస్వామి

ఉంగుటూరు: మండలంలో పేరుగాంచిన ఎ.గోకవరం సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. పెద్ద ఎత్తున కైకరం చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. కైకరం సీతారామ గీతార్చన భజన మండలి, ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంకీర్తనలు వినిపించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో సూర్య భగవానునికి పూజలు నిర్వహించారు. ఉంగుటూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పోతుకూచి సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా రథసప్తమి పూజలు

భీమడోలు: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాల్లో రథసప్తమిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం ప్రీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో 108 మంది బాలబాలికలు సూర్యనమస్కారం చేసారు. టీచర్ రవి సూర్యమంత్రాన్ని విద్యార్థులకు వివరించారు. గుండుగొలను వేంకటేశ్వర స్వామి ఆలయంలో పెద్దలు మొగళ్ల బంగారం, మొగళ్ల పాండు, సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ట్రాక్టర్‌పై మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీచర్లు ఎం.స్వర్ణలత, ఎం.విజయకుమారి, జ్యోతిబస్, ఎం.దుర్గాప్రసాదిని, ఎం.రవిభారతి, పీఎం శారారాణి, కేఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

కొవ్వలిలో దీవెన పండుగ

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ జ్యోతిరాజు అన్నారు. కొవ్వలి బేతేలు ప్రార్థన మందిర వార్షికోత్సవ వేడుకలు, దీవెనల పండుగలో ముఖ్య అతిథిగా జ్యోతిరాజు విచ్చేశారు. ఏసుక్రీస్తు బోధనలు నిరంతరం అనుసరిస్తూ దేవునికి అనుకూలంగా జీవించాలన్నారు. బేతేలు చర్చి పాస్టర్ విలియమ్స్, సంఘస్తులు జ్యోతిరాజును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు.